రాజేంద్రనగర్‌కు సీఎం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని మానస హిల్స్‌లోని శాంతా బయోటిక్స్ ఎండీ వరప్రసాద్‌రెడ్డి ఇంటికి మంగళవారం రాత్రి సీఎం రేవంత్ రెడ్డి వచ్చారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారులపై అడుగడునా పోలీసులను మోహరించి బందోబస్తు నిర్వహించారు.

విరాళం



విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 10 వేల రూపాయలు విరాళంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాససాగర్‌కు రూ.11 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాఠశాల అభివృద్ధిని చూసి మేము ఆకర్షితులమై మాకు తోచినంత విరాళం అందజేస్తున్నామన్నారు. మరో పూర్వ విద్యార్థి అడ్వకేట్ హరిదాసు రూ.5 వేలు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, బాలమని, శ్రీశైలం, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చు'

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను సాధిస్తారని మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మహవీర్ కళాశాలకు చెందిన విద్యార్థిని లకావత్ కోమలిక బీటెక్ ఎరోనాటికల్‌లో 2023–24 సంవత్సరానికి గాను గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆమె అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడం జిల్లా గిరిజన తండాకు చెందిన విద్యార్థిని మహవీర్ కళాశాలలో చదువుతూ బంగారు పతకం సాధించడం తమకు ఎంతో గర్వకారమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషశ్రీ, కళాశాల చైర్మన్ ఎస్.జయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు స్వీయ క్రమశిక్షణ అవసరం

శిల్పాహోమ్స్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

గచ్చిబౌలి: క్రీడాకారులకు స్వీయ క్రమశిక్షణ అవసరం అని శిల్పాహోమ్స్ చైర్మన్ పి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కొండాపూర్‌లోని ఏ జోన్ బ్యాడ్మింటన్ అకాడమీలో వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ టోర్నీ మంగళవారం ముగిసింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని సంస్థలు గుర్తించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. టోర్నీ నిర్వాహకుడు బీఏవిడి జిల్లా అధ్యక్షుడు కోసరాజు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి యువిఎస్‌బాబు , అసోసియేషన్ ప్రతినిధులు వంశీధర్, సుభాష్‌రెడ్డి, పివిఎల్‌కుమార్, ఏవి రమణారెడ్డి, వేణుచౌదరి, మనీషా తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ గుంతలో పడి మహిళ మృతి

గచ్చిబౌలి: ప్రమాదవశాత్తు భవనం పై నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాములు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ బాలాఘాట్ జిల్లా దేవల్గాన్ గ్రామానికి చెందిన జైషీలా(39) భర్త కుంరాజు నగరానికి వచ్చారు. అంజయ్యనగర్‌లో ప్లాట్‌నెంబర్ 74లో నిర్మాణంలో ఉన్న భవనంలో కూలీలుగా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. సోమవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో నాలుగో అంతస్థు నుంచి ప్రమాదవశాత్తు జారి లిఫ్ట్ గుంతలో పడింది. తీవ్ర గాయాలు కావడంతో ఆమెను కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్ది సేపటికి మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా అనంతోజ్ హన్స్‌రాజ్

చార్మినార్: హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ నూతన కమిటీ అధ్యక్షుడిగా అనంతోజ్ హన్స్‌రాజ్ ఎంపికయ్యారు. తనతో పాటు ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడిగా కమిశెట్టి శ్రీధర్‌ను ప్రతిపాదించామన్నారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్ గౌడ్, సిరిగిరి పాపయ్య, ధనంజయ్య, వినయ్, అనంతోజ్ రాజేష్, దిలీప్, సంజయ్, మల్యాల మధుసూదన్ యాదవ్, రేణిగుంట మహాత్మారావు, నోముల ప్రకాష్ యాదవ్, నగేష్ షిండే తదితరులు పాల్గొని అనంతోజ్ హన్స్‌రాజ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అందరి సహకారాలతో ఈసారి జరిగే ఆషాఢ మాసం బోనాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ప్రహరీలను తొలగించండి సారూ..

- రోడ్డుకు అడ్డంగా నిర్మాణం
- రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- రైల్వే గేటును మూసివేసిన అధికారులు
- రైల్వే అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదంటున్న స్థానికులు



శివరాంపల్లి నుంచి వచ్చే రహదారికి అడ్డుగా ప్రహరీ నిర్మాణం

మైలార్‌దేవ్‌పల్లి: ఏళ్ల తరబడి వాహనదారులు, పాదచారులు నడిచే రైల్వే గేట్ రహదారిని అకస్మాత్తుగా మూసివేయడంపై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పది కాలనీలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ఇక్కడి నుంచి ప్రజలు తమ అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వెళ్లడానికి సులువైన మార్గం ఉండేది. రెండేళ్ల క్రితం రైల్వే అధికారులు పట్టాలకు ఇరువైపుల ప్రహరీ నిర్మాణం చేస్తూ ప్రజలకు సమాచారం ఇవ్వకుండానే ఇక్కడి రైల్వే గేట్‌కు ఇరువైపుల శాశ్వతంగా ప్రహరీని నిర్మించి మూసివేశారు.

3 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తోంది..

రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్, మోహన్‌రెడ్డినగర్‌కు మధ్యన శివరాంపల్లి రైల్వే గేట్ ఉంది. సుమారు 45 ఏళ్ల నుంచి ఈ గేటు మార్గంలో వాహనాలు, పాదచారులు తిరుగుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. బెంగళూర్ ప్రధాన రహదారి నుంచి రైల్వే గేటు దాటగానే బాబుల్ రెడ్డినగర్, మోహన్‌రెడ్డినగర్, సాయిబాబానగర్, మార్కండేయనగర్, బృందావన్ కాలనీ, టాటానగర్, శాస్త్రీపురం వంటి కాలనీలు ఉన్నాయి. ఈ కాలనీకి రావాలంటే హైవే నుంచి 500 మీటర్లు మాత్రమే పడుతుంది. రైల్వే గేట్ మూయడంతో ఈ కాలనీకి రావాలంటే 3 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తుంది.



బాబుల్‌రెడ్డి నగర్ నుంచి శివరాంపల్లికి వెళ్లే రహదారిపై గోడ నిర్మాణం

ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు..

ప్రజలు అనారోగ్యానికి గురై, ప్రమాదాలు జరిగినప్పుడు, మహిళలు, వృద్ధులకు ఆరోగ్య సమస్యలు ఎదురైతే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే డ్రైవర్ తిరిగి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల పాఠశాలలకు, యువతి యువకులకు కళాశాలలకు వెళ్లడానికి ఊరు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విషయమై బాబుల్‌రెడ్డినగర్ మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ అనేక రకాలుగా రహదారిని మరల ఏర్పాటు చేయడానికి రైల్వే నిలయం చుట్టూ తిరుగుతున్నారు. అనేక ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. ఈ మధ్యనే అక్కడి బీఆర్ఎస్ నాయకులతో బైఠాయింపు చేశారు. మా రహదారిని తిరిగి పునఃప్రారంభించాలని రైల్వే అధికారులను కోరారు. పోలీసులు జోక్యం చేసుకొని ఏదైన ఉంటే రైల్వే నిలయంలో ఫిర్యాదు చేయాలి ధర్నాలు, రాస్తారోకోలు చేయకూడదని వార్నింగ్ ఇచ్చారు.

ఎంపీ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తాం



కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న స్థానిక ప్రజలు

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గోదా పాండుయాదవ్ ఆధ్వర్యంలో శివరాంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో మూడేళ్ల క్రితం మెయిటెనెన్స్ వర్క్ పేరుతో రైల్వే డిపార్ట్‌మెంట్ వారు రోడ్డును మూసి వేసేలా అడ్డంగా గోడను నిర్మించారని దీని కారణంగా స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను వినతి పత్రం ద్వారా ఆయన దృష్టికి తీసుకువచ్చారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..వీలైనంత త్వరగా సమస్య తీర్చే విధంగా చూస్తానన్నారు. వెంకటరమణ, సంతుగౌడ్, రావుల భాస్కర్, బొమ్మ రాజునర్సింహ్మ, మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌నాయక్, కిషన్ పాల్గొన్నారు.

రైల్వే మేనేజింగ్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశాం..



రెండేళ్ల నుంచి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు, రైల్వే అధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నాం. ఏళ్ల తరబడి ఉన్న రోడ్డును మూసివేయొద్దని కోరాం. ఒక్కసారి ఎల్‌సీ–8 రైల్వే గేట్‌కు ఆనుకొని ఉన్న కాలనీలను పరిశీలిస్తే వారికి తెలుస్తుంది. ఈ గేటు మూయడంతో మా కాలనీలన్నీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. రైల్వే అధికారులు ప్రహరీని తొలగించి రాకపోకలను కొనసాగించాలని కోరుతున్నాం.

– ఎస్.వెంకటేష్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు

పోకిరీల బెడద ఎక్కువయ్యింది..



రైల్వే గేట్‌కు అడ్డంగా గోడ నిర్మించడంతో రాత్రి సమయంలో నిర్మానుష్యంగా మారింది. పోకిరీలకు అడ్డాగా మారి అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి. అటువైపు పోలీసులు కూడా కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. రైల్వే గేటుకు అడ్డంగా నిర్మించిన ప్రహరీని తొలగించి కాలనీకి రాకపోకలు ఎప్పటిలాగే సాగించేలా చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నాం.

– వై.భాస్కర్, మార్కండేయనగర్

కమ్యూనిటీహాల్ నిర్మించాలి



ఎమ్మెల్యేను కలిసిన మణికొండ నాయకులు

మణికొండ: కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మించాలని మణికొండ మున్సిపాలిటీ నాయకులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. మంగళవారం ఆయనను కలిసి మున్సిపాలిటీ కేంద్రంలోని శివపురి కాలనీలో వందల గృహాల్లో వేలాది మంది నివసిస్తున్నారన్నారు. వారికి ఇతర సౌకర్యాలను కల్పించినా కమ్యూనిటీ హాల్ లేక పోవటంతో సామూహిక కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందిగా మారిందన్నారు. వారికి కాలనీలో ఉన్న అనువైన స్థలాన్ని ఎంపిక చేసి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్‌ను ఈ విషయాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, కాలనీ సంక్షేమ సంఘం చైర్మన్, సీనియర్ నాయకుడు బి.సాయిరెడ్డితో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



ముచ్చింతల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్

శంషాబాద్ రూరల్: భూ భారతి చట్టంపై అవగాహన పెంచడంతో పాటు సమస్యలను తెలుసుకోవడానికి ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.రవీందర్ దత్ సూచించారు. మండలంలోని ముచ్చింతల్, జూకల్‌లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 10 దరఖాస్తులు అందాయి. భూముల వారసత్వ హక్కుల అమలు, భూవిస్తీర్ణం నమోదులో తప్పుల సవరణ, మ్యుటేషన్ కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అధికారులు

రాజేంద్రనగర్ సర్కిల్ వార్డు కార్యాలయంలో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ వార్డు కార్యాలయంలో మంగళవారం భూభారతి చట్టంపై రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి ఉప్పర్‌పల్లి బుద్వేల్ రైతుల కోసం రెవెన్యూ సదస్సును మంగళవారం తహసీల్దార్ రాములు, డిప్యూటీ తహసీల్దార్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని అధికారులు తెలిపారు. ఈ సదస్సును బుధవారం శివరాంపల్లి జాగీర్ పైగా గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ సదస్సులు రాజేంద్రనగర్ వార్డు కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేన రెడ్డి, ఆర్ఐ సునీత, సంబరాజు, పృథ్వీ, పరమేష్, రవళి, ఆనంద్, సురేందర్, షేక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి



గోల్కొండ: బక్రీద్‌ను పురస్కరించుకొని కార్వాన్ నియోజకవర్గంలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో బల్దియా డీఎంసీ శశిరేఖ, ఇతర అధికారులతో బక్రీద్ పండుగపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బక్రీద్ సందర్భంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చెత్తకుప్పలు పేరుకుపోకుండా చూడాల్సిన బాధ్యత పారిశుద్ధ్య అధికారులపై ఉందన్నారు. జంతువుల వ్యర్థాలను ఎప్పటికప్పుడే తరలిస్తే దుర్గంధం వ్యాపించదని ఆయన పేర్కొన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి పారిశుధ్య పనుల కోసం పది జేసీబీలు, 30 టిప్పర్లు ఏర్పాటు చేస్తున్నామని బల్దియా డీఎంసీ శశిరేఖ అన్నారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా పారిశుధ్య అదనపు యూనిట్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ మహ్మద్ ఇర్షాద్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్ ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్: పాల్మాకులలో ఉన్న ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డి.రజని తెలిపారు. టీజీటీ తెలుగు, టీజీటీ హిందీ సబ్జెక్టులు బోధించడానికి అనుభవజ్ఞులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తాత్కాలిక పద్ధతిన నియామకం చేపడుతున్నట్లు తెలిపారు. ఆసక్తి కల్గి అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 10 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటే ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న రవీందర్

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్, గగన్ పహడ్ విద్యుత్ సెక్షన్ల పరిధిలో వివిధ సమస్యలపై కొత్త ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని గగన్ పహడ్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ రవీందర్ తెలిపారు. మంగళవారం గగన్‌పహడ్‌లోని సెక్షన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్షన్ పరిధిలోని గగన్‌పహడ్, సాతంరాయి, పాశంబండ, బుద్వేల్ రైల్వేస్టేషన్, వెంకటేశ్వర కాలనీ, నేతాజీనగర్, పద్మశాలిపురం, ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ, ఆప్కో కాలనీ, మధుర కాలనీకి చెందిన విద్యుత్ వినియోగదారులు సమస్యలు ఉంటే ఎఫ్ఓసీ 24 గంటలు ఈ నెంబర్ 8712470104 అందుబాటులో ఉంటుందని తెలిపారు.

అతివేగం.. చెట్టును ఢీకొన్న రెడీమిక్స్ లారీ

గచ్చిబౌలి: అతి వేగంగా వస్తూ రెడీమిక్స్ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టను ఢీ కొట్టింది. అటువైపు వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం ఏసీసీ రెడీమిక్స్ లారీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సమీపంలో ఎస్‌బీఐ ఎదురుగా చెట్టును ఢీ కొట్టి ఆగిపోయింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, సుమోటోగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు లారీని తొలగించారు.



భూ సమస్యలను పరిష్కరిస్తాం

జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మణికొండ: ప్రతి గ్రామంలో రైతులు, భూయజమానులకు ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మంగళవారం గండిపేట మండలం, ఖానాపూర్ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూముల సమస్యలను తొలగించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చిందని, ఇపుడు రెవెన్యూ సదస్సులను నిర్వహించి అన్ని రకాల సమస్యలపై ఫిర్యాదులు తీసుకుంటున్నామన్నారు. వాటిని రాబోయే రోజుల్లో పరిశీలించి దశల వారీగా సమస్యలను నివారించి రైతులకు మేలు చేస్తామన్నారు. గతంలో సమస్యలను అధికారులకు చెప్పినా వారు చేసే అవకాశం లేదని, ఇపుడు ఎక్కడికక్కడే సమస్యలను పరిష్కరించే విధానం ఉందని, సమస్యలు ఉన్న వారంతా రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఖానాపూర్ గ్రామంలో గతంలో తమ సొంత పొలాలను నిషేధిత జాబితాలో చేర్చటంతో జిల్లా కలెక్టర్ వద్దకు పదుల సార్లు వెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని రైతులు ఆమె దృష్టికి తెచ్చారు. దీంతో ఆమె వాటన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా 25 మంది రైతులు తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, పాస్ పుస్తకాల్లో సర్వేనెంబర్‌లు మిస్సింగ్ అయ్యాయని ఐదు మంది, తమ వారసులకు భూమిని విరాసత్ చేయాలని 8 మంది రైతులు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గండిపేట తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ టి. కృష్ణ, మాజీ కౌన్సిలర్ జి. అమరేందర్‌రెడ్డి, ఆర్ఐ సురేష్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజీఐటీ విద్యార్థులకు బంగారు పతకాలు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎంజీఐటీ విద్యార్థిని

మణికొండ: ఉత్తమ విద్యా ప్రతిభ చూపి తమ రంగంలో అగ్రగామిగా నిలిచిన గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ టెక్నాలజీ(ఎంజీఐటీ) విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నారు. మంగళవారం కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూ స్నాతకోత్సవం సందర్భంగా 2020–2024 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులకు స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా వారు ప్రశంసా పత్రాలు, బంగారు పతకాలను అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో పి.శ్రీజ, బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో జి. అభినయ్, బీటెక్ మెటలర్జికల్, మెటీరీయల్స్ ఇంజినీరింగ్‌లో ఎం. నిఖితారెడ్డి, బీటెక్ కంప్యూటర్ సైన్స్, బిజినెస్ సిస్టమ్స్‌లో కె.సాయి భారతి, బీటెక్ కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగంలో పి. ఆయేషాలు పతకాలను అందుకున్నారన్నారు.

తండ్రి, కూతురికి గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం



సురేష్‌బాబు, రియాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన తండ్రి, కూతురు సంగీతంలో గిన్నిస్ వరల్డ్ రికార్డును సాధించారు. దాసరి సురేష్‌బాబు, దాసరి రియా రోస్లిన్(స్టేఫీ)లు హాలెల్ మ్యూజిక్ స్కూల్ డైరెక్టర్ అగస్టిన్ దండింగి ప్రోత్సాహంతో ఈ వరల్డ్ రికార్డును సాధించినట్లు తెలిపారు. సురేష్ ప్రస్తుతం ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రియా డాన్ బాస్కో స్కూల్‌లో 4వ తరగతి చదువుతోందన్నారు. సంగీతంపై ఆసక్తితో ఇద్దరూ హాలెల్ మ్యూజిక్ స్కూల్ సంగీత శిక్షణా కార్యక్రమంలో చేరి ఆగస్టిన్ దండింగి మార్గదర్శకత్వంలో గానం, కీబోర్డ్ వాయిద్యాలలో ప్రావీణ్యం పొందారు. సంగీత కార్యక్రమంలో 18 దేశాల నుంచి విద్యార్థులు ఆన్‌లైన్‌లో కీబోర్డ్ మెలోడీలను వాయించారు. 1046 మంది విద్యార్థులు పాల్గొనగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారి రిచర్డ్ స్టెన్సింగ్ దీనిని గిన్నిస్ వరల్డ్ రికార్డుగా గుర్తించారన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వినయ్‌రెడ్డి, నరేంద్రబాబు, ప్రసాద్‌రెడ్డి, విజయ్, పద్మనాభన్ తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



తడి, పొడి చెత్త సేకరణ అవగాహనలో అలకాపూర్ వాసులు

మణికొండ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని మణికొండ మున్సిపాలిటీ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ అన్నారు. మంగళవారం మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ సంపత్ ఆధ్వర్యంలో అలకాపూర్ టౌన్‌షిప్ ఎంజీ పార్కులో తడి, పొడి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత, వర్షాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ..అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్తను వేరుగా చేసి మున్సిపాలిటీ వాహనాలను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. టౌన్‌షిప్‌లో రోడ్ల వారీగా మున్సిపాలిటీ చెత్త ఆటోలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బందితో పాటు టౌన్‌షిప్ వాసులు పాల్గొన్నారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రారంభం



సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: హైదర్షాకోట్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం మొదటి అంతస్తును మంగళవారం ప్రారంభోత్సవం జరిగింది. పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్ సొంత నిధులతో భవన మొదటి అంతస్తును నిర్మించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరై ప్రారంభించి రాందాస్‌ముదిరాజ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సత్తయ్య, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విభాగం అధికారులతో డీసీ సమావేశం



అధికారులతో సమావేశమైన డీసీ

రాజేంద్రనగర్: వర్షాకాలం నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సమావేశాలు నాలాలు, వరద, డ్రైనేజీ కాలువలలో పూడికతీత పనులపై చర్చించారు. ఆయా ప్రాంతాల్లో మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఉప కమిషనర్ ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, అత్తాపూర్ డివిజన్ల పరిధిలో మొత్తం 49.3 కిలో మీటర్ల మేర నాలాలు, వరదనీటి కాలువలు ఉన్నాయన్నారు. ఇందులో 28 కిలో మీటర్ల మేర నాలా పూడికతీత పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ముందుగానే పనులను ప్రారంభించామన్నారు. మిగిలిన 50 శాతం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు.